

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### జాగత్త.. జాగత్త.. జాగత్త!

*ఈ శీర్షికలో వెలువడుతున్న 60వ గల్పిక ఇది..!! గత 60 నెలలుగా ఒక్కనెల కూడా అంతరాయం లేకుండా*

*ఈ శీర్షికని కొనసాగిస్తున్న రచయిత్రిగారికి అభినందనలతో*

*- సంపాదకుడు*

**ప్రతి సందు మొదట్లోనూ, నాలుగు రోడ్ల** కూడలిలోనూ ఒక విగ్రహం ఉంటుంది. ఒక రోజు ఓ చిన్న కుర్రాడు ఓ విగ్రహాన్ని చూపించి "ఆంటీ.. ఈయన ఎవరు?" అని అడిగాడు.

నేను రోజూ ఆ సందు మొదట్లో ఉన్న ఆ విగ్రహం వైపు చూసినా ఎవరూ అని గమనించలేదు. అసలు కనిపించిన ప్రతివాళ్ళనీ గుర్తుపెట్టుకోలేంగా. బాగా చూసాను. కళ్ళద్దాలున్నాయి. టోపీ ఉంది. నెహ్రూ అయితే కళ్ళద్దాలు ఉండకూడదు, గాంధీ అయితే టోపీ ఉండకూడదు. ఇందిరాగాంధీ అయితే భుజాలవరకే చెక్కుతారు. అంబేద్కర్ అయితే చేతిలో పుస్తకం మస్ట్. ఎన్.టి.ఆర్ అయితే ఒక చెయ్యి ఎదురుగా ఉన్న డైరెక్షన్‌ని చూపిస్తూ ఉండాలి. చిరంజీవిగారి దయవల్ల బాగా ప్రసిద్ధిలోకి మళ్ళీ వచ్చిన జ్యోతీరావ్ ఫూలే అయితే తలపాగా ఉండాలి. మదర్ థెరిసా అయితే ఆ కట్టూ బొట్టూ వేరే. ఇంక ఆ మధ్య పగలకొట్టక ముందున్న ట్యాంక్ బండ్ మీదున్న ప్రాచీన కవులు, రాజులూ వాళ్ళని మనం ఎవరం చూసి ఉండలేదు కనుక విగ్రహాలు ఎలా చెక్కినా గొడవలేదు. క్రింద పేర్లు కూడా ఎలానూ ఉంటాయి.

ఈ విషయం గుర్తురాగానే దగ్గరకెళ్ళి అక్షరాలు చదవడానికి ప్రయత్నించాను. బాగా దుమ్ము పట్టి చదవడానికి వీలు లేకుండా ఉన్న అక్షరాలు కష్టపడి చదివితే లాల్‌బహదూర్ శాస్త్రి అని తెలిసింది. కానీ ఆయన పోలికలు ఏవీ ఆ బొమ్మలో లేవు. లేటెస్ట్ వాళ్ళవి కొందరివి వాళ్ళ పిల్లలు దగ్గరుండి చెక్కించుకుంటున్నారు కాబట్టి పోలికలు బాగానే కనిపిస్తున్నాయి. క్లాక్ టవర్ దగ్గర పెట్టిన ఈశ్వరీ రెడ్డిగారి విగ్రహం పొడవుగా, చీర కట్టుకుని, ధీమాగా నిలబడి బావుంటుంది.

ఆవిడ మన మినిస్టర్ గీతారెడ్డిగారి తల్లిగారు. నేను ఆవిడ్ని చూసి ఉన్నాను కాబటి పోల్చుకోగలిగాను. అలాగే ఓ చోట టి.అంజయ్యగారి విగ్రహం ఉంది. చూడగానే ఆప్యాయంగా అనిపించింది. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా, ఆయన పేరుతో బోలెడు జోక్స్ ప్రాచుర్యంలో ఉండేవి. "స్పీడ్ బ్రేకర్స్ వెయ్యడం చాలా పెండింగ్‌లో ఉండిపోయాయి సార్" అంటే "అన్నీ మన ఇంటిముందటే వేయించండి" అన్నారని చెప్పుకునేవారు.

ఇలా ఆ చిన్నపిల్లవాడి ప్రశ్నవల్ల నా బుర్రలో విగ్రహ మథనం మొదలయి నిగ్రహం కోల్పోయి, ఏ విగ్రహం కనపడ్డా కార్లోంచి తల బయట పెట్టి ఆ విగ్రహాన్ని పోల్చుకోడానికీ, పేరు చదవడానికీ ప్రయత్నిస్తున్నాను. ఖైరతాబాద్ వైపు వెళ్తుంటే ఒక పెద్ద భూగోళం లాంటి గోళం.. దానిమీద ఓ పక్షి, విగ్రహం కనిపించింది. చదివేలోగా కారు వెళ్ళిపోయింది.

ఆఫీస్‌కి వెళ్తూనే ఎదురుగా ఉన్న ఓ పెద్దమనిషిని ఆ లొకేషన్ చెప్పి, ఆ బాల్, ఆ పక్షి ఏవిటని అడిగాను. దానికి అతను చిరాగ్గా "గాడిదగుడ్డూ, తీతువు పిట్టా" అని వెళ్ళిపోయాడు.

అతని క్రియేటివిటీని మెచ్చుకుంటూ, బాగా చెప్పాడు కానీ అది అయి ఉండదు అనుకున్నాను. తరువాత అదేవిటో చదివి రమ్మని డ్రైవర్‌ని పురమాయించాను. వాడికి చదవడం అంత బాగా రాదు. ఏదో మంజిలో అని చెప్పాడు. మరి ఆ చిహ్నం ఏవిటో అర్థం కాలేదు.

ఓసారి మా అన్నయ్య ఫ్రెండ్ ఓ విగ్రహాన్ని చూపించి "ఎవరని?" అడిగాడుట. మా అన్నయ్య "పొట్టి శ్రీరాములు" అని చెప్పాడుట.

"అబ్బా! పొడగరే.." అన్నాడట అతను.

అసలు ఈ విగ్రహాలని స్టడీ చెయ్యడం మొదలు పెట్టాక ప్రయాణం చెయ్యడం బోర్ అనిపించడంలేదు.

కానీ ఓ విషయం వీళ్ళు బతికుండగానే కాదు పోయాక కూడా ఓ పట్టాన అర్థం కావడంలేదు.

నన్నయ్య, తిక్కన, ఎర్రన, త్యాగయ్య అంతా ఒకే పోలికలో కోటేరు ముక్కులతో, పెద్ద పెద్ద కళ్ళతో, చిన్న పెదవులతో, గుండూ, పిలకలతో ఘంటం పట్టి తాటాకు మీద ఏదో రాస్తుంటారు కాబట్టి కవులని గుర్తుపట్టచ్చు. త్యాగయ్యగారికి మాత్రం చిడతలూ, తంబురా ఉంటాయి. మొల్ల జుట్టు విరబోసుకుని, కొంగు భుజాల మీదుగా కప్పుకుని రాస్తూ ఉంటుంది. వీర శివాజీ తలపాగా, ఖడ్గం ప్రత్యేకం.

ప్రకాశం పంతులుగారి మొహం అచ్చు వాళ్ళ మనవడు 'విజయచందర్'గారి లాగే చెక్కుతారు కాబట్టి చిక్కులేదు. ప్రొఫెసర్ జయశంకర్ గారి విగ్రహం అచ్చు ఆయన పోలికలలోనే ఉంది. మొన్న మొన్నటి దాకా టీ.వీ.ల్లో చూసాంగా. అలాగే వై.ఎస్.ఆర్ గారి విగ్రహంలో పోలికలు చెడవు.

ఈ మధ్య రోడ్ల మీద మనుషులూ ఎక్కువయ్యారు. విగ్రహాలూ ఎక్కువయ్యాయి. దాంతో ట్రాఫిక్ జాములు. కానీ పోయిన వాళ్ళని మనం గౌరవించుకోవాలంటే ఈ విగ్రహాలు తప్పవు కదా! ఎలాగో ఇరికించి విగ్రహాలని పెట్టాలి. వాటిని ఎవడూ రాత్రిపూట తాగి వాహనాలతో గుద్దెయ్యకుండా కంచెలూ, ఫెన్సింగులూ కూడా ఏర్పాటు చేసుకోవాలి. కనీసం విగ్రహాలైనా కాపాడుకోవాలిగా ప్రజాస్వామ్యంలో. కొన్నిసార్లు గాంధీగారి చేతికర్ర ఉండదు. శాంతి దూత నెహ్రూగారి చేతిమీదున్న కపోతం తల ఉండదు. అవి మళ్ళీ రిపేర్ చేయించరు.

ఎన్.టి.ఆర్‌గారు చాలా అందమైన మనిషి. ఆయన్ని నేను చిన్నతనంలో సూట్‌లోనూ, సినిమాల్లో బోలెడు చిత్రవిచిత్రమైన డ్రెస్సుల్లోనూ చూసేదాన్ని. కానీ విగ్రహాలు మాత్రం కాషాయంతోనూ, బొట్టుతోనూ, రుద్రాక్ష తావళంతోనూ ఉంటాయి. అందమైనవీ, వయసులో ఉన్నప్పటివీ ఎందుచేతనో పెట్టరు. పోనీ ఆయన సన్యాసా అంటే కాదు. పోయేదాకా సంసారే.

అసలు మన భారతీయుల్లో ఉన్న గొప్ప చాదస్తం ఏవిటంటే, నాకు విగ్రహం వద్దో, అసలు విగ్రహారాధనలు అక్కర్లేదు అన్న వివేకానందుడిదీ, బుద్ధుడిదీ అందరివీ విగ్రహాలు చెక్కించి పెడ్తారు.

మొన్న చేతన్ భగత్ ఏదో పుస్తకంలో "కనీసం మనకి మంచి రోడ్లూ, చిన్న దేశాల్లో ఉన్న లాంటి ఎకానమీ, సదుపాయాలు కూడా సాధించలేదు ఈ నాయకులు. నేను బ్యాంకాక్ వెళ్ళాక జీవితంలో మొదటిసారి ఎంత వెనకబడి ఉన్నామో తెలిసింది" అన్నాడు.

నిజమే నాకూ అనిపిస్తుంది. బ్రిటీష్ వాళ్ళు వచ్చి ఉన్న కొద్ది రోజుల్లోనే బ్యారేజీలూ, యూనివర్శిటీలూ కోర్టులూ, రోడ్లూ, మొదలైనవి ఎన్నో నిర్మించారు. ఇప్పటికీ ఎర్ర బ్రిక్ రంగులో వాళ్ళ కట్టడాలు కొన్ని పట్టణాలలో ఎంతో అందంగా ప్రత్యేకంగా కనపడ్తుంటాయి. శుచీ, శుభ్రతా, విద్యా, సంస్కారం కూడా నేర్పాలని చూసారు. ఇంకా కొన్నాళ్ళు వాళ్ళని వెళ్ళగొట్టకుండా ఉండి ఉంటే,

కనీసం మన వాళ్ళకి టాయ్‌లెట్స్ ఎలా ఉంచుకోవాలో అన్నా నేర్పించి వెళ్ళేవారేమో పాపం. వాళ్ళు వదిలి వెళ్ళిన స్టేజ్‌లోనే ఇప్పటికీ మన దేశాల్లో శుచీ, శుభ్రతలు ఉండిపోయాయి అంటే ఇది ఎవరి తప్పు? నాయకులదా? వీళ్ళ విగ్రహాలు మన స్వాతంత్రం తెచ్చినందుకు పెట్టుకున్నాం సరేకానీ దేశాన్ని మిగతా డెవలప్డ్ నేషన్స్‌లా మలిచే ప్రయత్నాలు చెయ్యని మిగతా వాళ్ళ విగ్రహాలు మనకెందుకూ?

మా మధురవాణి చెప్పింది, జర్మనీలో "అదిగో పదిహేడవ శతాబ్దంలో ఈ ప్రాంతాల్ని పాలించిన రాజు", "పద్దెనిమిదవ శతాబ్దంలో కవీ" అని ఎప్పటి వాళ్ళవో కానీ, ఇలా ప్రెజెంట్ పొలిటీషియన్స్‌వీ, ఓ ప్రాంతీయ పార్టీ పెట్టి నాలుగురోజులు ధర్నాలు చేయించిన వాళ్ళవీ, ఇండిపెండెంట్ అభ్యర్థులవీ, నా కిష్టమైతే నా తాతగారిదీ ఎక్కడ పడితే అక్కడ పెట్టుకోకూడదుట.

మనకన్నా జనాభాలో పెద్దదైన చైనా కూడా అత్యంత అందంగా ఉందని మొన్న చూసొచ్చిన ఫ్రెండ్స్ చెప్పారు. నేపాల్ కూడా మనదేశం కన్నా అందంగానే ఉంటుంది. ఇండియాని సందర్శించిన ఏ ఫారెన్ టూరిస్ట్ అయినా ఈ దేశపు టాయ్‌లెట్ సౌలభ్యాలని మర్చిపోలేరు. మల్లాదిగారు ఓ ట్రావెలాగ్‌లో 'ట్రాష్‌బిన్' మీద యూ.కె.లో ఎక్కడో 'ఇండియా' అని రాసారనీ తనకి ఎంతో కోపం వచ్చిందనీ రాసారు. నాకూ చాలా కోపం వచ్చింది అది చదివాక. కానీ అందులో నిజం ఉంది. ఇంకొకరు హేళన చేస్తున్న అంశాల్ని మనం ఎందుకు దిద్దుకోలేకపోతున్నాం?

ఆఫీసుల్లో చాలా చోట్ల నీళ్ళు వచ్చే పంపులుంటాయి. ఫ్లష్ చేసే విధానం ఉంటుంది. లేకపోతే బక్కెట్‌లో నీళ్ళూ, మగ్గూ ఉంటాయి. అయినా వాడిన తర్వాత నిస్సిగ్గుగా నీళ్ళు పొయ్యకుండా వచ్చేసేవాళ్ళని చూస్తూ ఉంటాం. ఎందుకు?

విదేశాలకి వెళితే చాక్లెట్ తిని రేపర్ జేబులోనే పెట్టుకుని వచ్చి డస్ట్‌బిన్ కోసం వెదికే వాళ్ళు, ఈ దేశంలో అడుగుపెట్టగానే ఎందుకు సిగ్గులేకుండా మెట్లమీదో, రోడ్డు మీదో పారేసి పోతారు?

పాన్ తిని, గుట్కా తిని ఉమ్మేస్తూ, బస్సుల్లో, ఆటోల్లో పోయేవాళ్ళనీ, రోడ్డు మీద నడిచే వాళ్ళనీ ఆపి ఈ పోలీసులు ఎందుకు ఫైన్ కట్టమనరు? ఎందుకు శుచీ శుభ్రతలని కాపాడే రూల్స్ లేవు? మన టూరిజం మినిస్టర్ రోప్‌వేలూ, భవనాలూ, పార్కులూ, జలయంత్రాలతో బాటు రోడ్లు శుభ్రంగా ఉంచే మెజర్స్ ఎందుకు సూచించడు? శానిటేషన్, హైజీన్‌లేని దేశాలకి టూరిస్టులు ఎందుకొస్తారు? టూరిజం ఎలా డెవలప్ అవుతుంది?

నా మటుకు నేనే మా ఆయనతో 'ఇండియాలో ట్రిప్స్ వెయ్యద్దు, టాయ్‌లెట్స్ శుభ్రంగా ఉండవు" అంటాను. ఇదే కారణం వల్ల చాలామంది ప్రయాణాలూ, యాత్రలూ అంటే చిరాకు పడ్తారు.

అంతెందుకు 'సులభ కాంప్లెక్సులు' కట్టారు. (పేరులోనే ఉంది చిక్కు. సులభ అంటే సింపుల్.. కాంప్లెక్స్ అంటే, సింపుల్‌కి విరుద్ధం) అవి స్నానశాలలు కూడానూ. హాయిగా ఓ సగటు పౌరుడు అమెరికాలో వెళ్ళినట్లు వాటిలోకి వెళ్ళిరాగలడా? అవి ఏ సందులో ఎంత దూరాన ఉన్నాయో ముక్కులు పగిలే దుర్వాసన వల్ల తెలుసుకోవచ్చు. పైగా అవేమీ ఫ్రీ కాదు. డబ్బులు కూడా వసూలు చేస్తున్నారు. తప్పు మెయిన్‌టెనెన్స్ వాళ్ళదే కాదు. వాడే మనుషులది కూడా. మళ్ళీ రేపు నేనే ఉపయోగించుకోవచ్చు. శుభ్రంగా ఉంచుకుందాం అనే ఆలోచన వచ్చినా రావడం లేదు. దీనికి నిరక్షరాస్యతా, పేదతనమే కారణాలయితే, అన్ని దేశాల్లోనూ ఇలాంటి వాళ్ళు ఉంటారు. కాదు బద్ధకం.. నిర్లక్ష్యం స్వార్థం వీటికి కారణాలు.

నేను ఇంతకుముందు కౌముదిలో రాసాను. శుభ్రమైన రోడ్లూ, పారిశుధ్యం, మొదలైనవి మేనిఫెస్టోలో చేర్చి ఆచరించే ఏ పార్టీకైనా నేను ఓటు వెయ్యడానికి సిద్ధం.

ఎలాగూ మన నేతల్నీ, ప్రభుత్వాన్నీ ఎన్నుకునేది ఎడ్యుకేటెడ్ క్లాస్ కాదు. వీళ్ళు గుమ్మం కదిలి ఓటు వెయ్యడానికి వెళ్ళనే వెళ్ళరు. ఓట్లు నోట్లకో, సారాసీసాలకో వేసే వర్గం మన తల రాతల్ని నిర్ణయిస్తారు. మనం ఐదేళ్ళు కుక్కిన పేనుల్లా భరిస్తాం.

ఈ శతాబ్దంలో కూడా కంప్యూటర్‌లో ఈ మెయిల్ పంపిస్తాం అంటే 'మేం వాడం. పర్సనల్‌గా వచ్చి ఇవ్వండి' అనే ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది ఉన్న దేశం మనది.

ఈ నాటికీ 'మీ పిల్లలకి సకాలంలో పోలియో డ్రాప్స్ వేయించండి' అని పది నిమిషాలకోసారి ఏ అమితా బచ్చనో, సచిన్ టెండూల్కరో, ఐశ్వర్యారాయో టీ.వీ.లో రొద పెడితే కూడా వినని జనం ఉన్నారు.

"మీ బహూకి తలమీద కొంగు తప్పని సరి. కానీ బహిర్భూమికి ఔట్ డోర్‌కి పంపిస్తారా! సిగ్గు దానికి అక్కర్లేదా?" అని విద్యాబాలన్ చేత టెలీఫిల్మ్ తీయించాల్సిన పరిస్థితిలో ఉన్నాం.

"ఆడపిల్ల అయితే అబార్షన్ చేయించకండి" అని కవితల్లో, కథల్లో నాటకాలలో, సినిమాలలో ఇంకా మొత్తుకోవలసి వస్తోంది.

"లంచం తీసుకోకండి అదే నేరం" అనే లఘు చిత్రానికి ప్రభుత్వం ఫైనాన్స్ చెయ్యాలంటే 'లంచం' పెట్టాలి. దానికి అవార్డో రివార్డో రావాలంటే 'లంచం' పెట్టాలి.

ఈ దేశం.. ఈ చరిత్రా ఇలాగే కొనసాగితే మన పిల్లలూ, భావితరాలూ అమెరికా నుండో, ఇంకో దేశం నుండో వెనక్కి రారు. ఇక్కడ బ్రతకలేరు. మనదేశంలో వృద్ధులూ, బలహీనులే మిగుల్తారు.

**తస్మాత్ జాగ్రత్త.. జాగ్రత్త.. జాగ్రత్త.**

Post your comments

